

వచ్చే నెల 9, 10 తేదీల్లో విశాఖలో ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సహా పలువురు ప్రముఖులు రాక
- నగరంలోని హోటళ్లలో 600 గదులు బుకింగ్

- 8లో

వచ్చే నెల 21న ప్రధాని విశాఖ రాక

యోగా దినోత్సవానికి హాజరు

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 21వ తేదీన నగరంలో నిర్వహించనున్న కార్యక్ర మానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. నగరంలో ఏటా తూర్పు నౌకాదళం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జిల్లా యంత్రాంగం వేర్వేరుగా యోగా దినోత్సవాలు నిర్వహిస్తుంటాయి. అయితే ప్రధానమంత్రి ఏ కార్యక్రమంలో పాల్గొననున్నారో స్పష్టత రావలసి ఉంది.



అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి శుక్రవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతున్న శాసనసభ స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

నాడు నిర్లక్ష్యం.. నేడు మోక్షం!

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం

- స్కూళ్లు పునఃప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశం
- నాడు-నేడు పేరుతో అసంపూర్తిగా వదిలేసిన గత వైసీపీ ప్రభుత్వం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు రెండో దశలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభించి, అసంపూర్తిగా వదిలేసిన వాటిని పూర్తి చేయాలని నిర్ణయించింది. 'స్కూల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్' పేరుతో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించింది. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి ఈ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది.



కె.కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లర్ల స్థాయిలో నిలిచిన ప్రహరీ గోడ నిర్మాణం

'మనబడి నాడు-నేడు' కార్యక్రమం రెండో దశ కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం 2023-24వ సంవత్సరంలో జిల్లాలో 604 పాఠశాలల్లో 988 పనులు చేపట్టేందుకు రూ.250 కోట్లు మంజూరు చేసింది. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, నీరు, విద్యుత్తు, ప్రహరీ గోడల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పేరెంట్స్ కమిటీల పేరుతో వైసీపీ నేతలే పనులు చేపట్టగా, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు నత్తనడకన సాగాయి. ఇదే సమయంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి ఎక్కడికక్కడ పనులు ఆపేశారు. గత వైసీపీ పాలనలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆయా పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణాల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. విద్యా శాఖ, సమగ్ర శిక్ష అధికారులు మండలాల వారీగా వివరాలు సేకరించారు. వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయేనాటికి చేసిన పనుల విలువ రూ.131 కోట్లుగా అధికారులు తేల్చారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.119 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు.

పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి

జిల్లాలోని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడల నిర్మాణం, ఇతర పనుల గురించి సమగ్ర శిక్షా విభాగం ఈఈ నరసింగరావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. అసంపూర్తి పనుల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశామన్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కాగానే నిర్మాణ పనులు చేపటి, పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పూర్తి చేస్తామని చెప్పారు.

చెరకు రైతుకు దక్కని ఊరట

- టన్నుకు రూ.150 మాత్రమే పెంచిన కేంద్రం
- గత ఏడాదితో పోలిస్తే టన్నుకు రూ.135 తక్కువ
- గోవాడ రైతుల పరిస్థితి మరింత దయనీయం
- కేంద్రం ప్రకటించిన ధర కంటే తక్కువ చెల్లింపు
- పంచదార రికవరీ శాతం పడిపోవడమే కారణం
- చెరకు సాగుకు మరింత మంది దూరం?

మద్దతు ధర అరకొరగా పెంపు



చెరకు తోట

ఏడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, రికవరీ శాతం దృష్ట్యా గోవాడ రైతులకు దక్కిన ధర ఇలా వున్నాయి.

సంవత్సరం	కేంద్ర మద్దతు ధర	గోవాడ రైతులకు దక్కిన ధర
2018-19	రూ. 2,750	రూ.2,681
2019-20	రూ. 2,750	రూ.2,612.5
2020-21	రూ. 2,850	రూ.2,707.5
2021-22	రూ. 2,900	రూ.2,755
2022-23	రూ. 3,000	రూ.2,821.25
2023-24	రూ. 3,115	రూ.2,919
2024-25	రూ. 3,400	రూ.3,230
2025-26	రూ.3,550	ప్రకటించాల్సి ఉంది

చోడవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి చెరకు మద్దతు ధర టన్నుకు రూ.150 మాత్రమే పెంచడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెంచిన మద్దతు ధర కంటితుడుపుగా వుందని పెదవి విరుస్తున్నారు. గత ఏడాది టన్నుకు రూ.285 పెంచింది. ఈ ఏడాది మరికొంత పెంచుతుందని సాగుదారులు ఆశించారు. కానీ భారీగా తగ్గించేసి రూ.150కి పరిమితం చేసింది. కేంద్రం తీరు చెరకు రైతులను తీవ్రనిరాశకు గురిచేస్తున్నది. ఏటేటా చెరకు సాగు తగ్గిపోతున్న తరుణంలో మద్దతు ధరను సంతృప్తికర స్థాయిలో పెంచాల్సిన ప్రభుత్వం.. గత ఏడాదితో పోలిస్తే రూ.135 తగ్గించడం దారుణమని రైతులు అంటున్నారు. మద్దతు ధరల విషయంలో ప్రభుత్వ తీరు ఇదే విధంగా వుంటే చెరకు సాగుకు దూరం కావాల్సి వస్తుందని చెబుతున్నారు. వాస్తవానికి ఇతర పంటలతో పోలిస్తే చెరకు సాగుకు పెట్టుబడి, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. మరోవైపు మద్దతు ధర మొక్కుబడిగా పెంచుతుండడంతో చెరుకు సాగుదారులు నష్టాలపాలవుతున్నారు. ఈ కారణంగానే రైతులు చెరకు సాగుకు స్వస్తి చెప్పి, ఇతర పంటలవైపు మళ్లుతున్నారు. ప్రస్తుత అనకాపల్లి జిల్లా పరిధిలో ఒకప్పుడు 70 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఇప్పుడు 15 వేల ఎకరాలకు తగ్గిపోయింది. మద్దుతు ధర ఆశాజనకంగా లేకపోవడంతో చెరకు సాగు మరింత తగ్గిపోయే ప్రమాదం వుంది.

గోవాడ రైతుల పరిస్థితి మరీ దయనీయం

చెరకు మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచినా గోవాడ చెరకు రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. పంచదార రికవరీ 10.25 శాతం సాధించే షుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుందని కేంద్రం ప్రకటించడమే దీనికి కారణం. వివిధ కారణాల వల్ల గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గత కొన్ని సీజన్లుగా పంచదార రికవరీ తొమ్మిది శాతానికి మించడం లేదు. ఇటీవల ముగిసిన 2024-25 సీజన్‌లో పంచదార రికవరీ మరింత తగ్గిపోయినట్టు తెలిసింది. రికవరీ వివరాలను ఫ్యాక్టరీ అధికారులు రెండు, మూడు రోజుల్లో వెల్లడించే అవకాశం వుంది. దీనినిబట్టి వచ్చే సీజన్‌లో చెరకు మద్దతు ధరను ఫ్యాక్టరీ అధికారులు ప్రకటిస్తారు.

నష్టపోతున్న గోవాడ రైతు

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో పంచదార రికవరీ శాతం ఆశాజనకంగా ... మిగతా 8వ పేజీలో

జి.భీమవరంలో సీనియర్ సిటిజన్ హోం

- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



వర్చువల్‌గా వయోవృద్ధాశ్రమాలను ప్రారంభిస్తున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

కశింకోట, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.భీమవరంలో 'పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ స్పాస్టిక్స్' అనే సంస్థ ఏర్పాటుచేసిన సీనియర్ సిటిజన్ హోంను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ప్రారంభించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, దేశ వ్యాప్తంగా పలు సీనియర్ సిటిజన్స్ హోంలను వర్చువల్‌గా ప్రారంభించారు. వీటిలో జి.భీమవరంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ హోం కూడా వుంది. తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని, వయోజనులను భవిష్యత్తుకు మార్గదర్శకులుగా భావించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి అన్నారు. జి.భీమవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ, రాష్ట్రానికి కొత్తగా 15 సీనియర్ సిటిజన్ గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని, వీటి వల్ల ఆయా పథకాలను వినియోగించుకోవడం ... మిగతా 8వ పేజీలో

సింహగిరిపై ప్రసాద్ పనుల్లో తీవ్ర జాప్యం

2022 డిసెంబరులో రూ.54 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

- రెండేళ్లలో పూర్తికావల్సిన పనులు ఇంకా కొనసాగుతున్న వైనం
- ఆ నిధులతోనే ఆ గోడ నిర్మాణం
- నిర్మాణంపై తలో మాట... బాధ్యత వహించని అధికారులు
- రాష్ట్ర స్థాయి అధికారుల విచారణకు కమిటీ సన్నాహాలు
- ప్రమాద ఘటన తరువాత మరో టెండర్ పిలిచిన ఏపీటీడీసీ



'ప్రసాద్' నిధులతో నిర్మాణంలో వున్న బహుళ అవసరాల భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహగిరిపై కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' (పిలిగ్రమేజ్ రీజునువేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్‌మెంటేషన్ డ్రైవ్)' పనులు పూర్తిచేయడంలో ఏపీటీడీసీ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఈ పథకం కింద 2022 డిసెంబరులో రూ.54 కోట్లు మంజూరయ్యాయి. వీటిని 24 నెలల్లో అంటే 2024 డిసెంబరుకు పూర్తిచేయాల్సి ఉంది. కానీ వైసీపీ హయాంలో కనీసం ఐదు శాతం కూడా చేయలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కలెక్టర్ వాటిని సమీక్షించి వేగవంతం చేయించారు. ఈ పనుల విషయంలో ఏపీటీడీసీ, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపించింది. ఇప్పటివరకూ నిర్దేశించిన పనుల్లో సగం కూడా పూర్తికాలేదు. ఇంకో ఆరు నెలల్లోగా అవి పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు. ఈ పనుల కోసం మాస్టర్ ప్లాన్ ఒకటి రూపొందించి దానికి ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకున్నారు. మధ్యలో మాస్టర్ ప్లాన్‌ను మార్చేశారు. పలు మార్పులు, చేర్పులు చేసి దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. దానికి అక్కడి నుంచి ఆమోదం రాలేదు. ఈలోగా చందనోత్సవం వచ్చింది. దీనికి అవసరమైన పనులు కూడా ఆ నిధుల నుంచే చేయాలని దేవస్థానం అధికారులు కోరారు. ఏపీటీడీసీ అధికారులు అయిష్టంగానే అంగీకరించారు. జోడుభద్రాల వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవు. అధికారుల మౌఖిక ఆదేశాలు, ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్ లక్ష్మణరావు గోడ నిర్మాణం చేపట్టారు. దానికి అధికారులు డిజైన్ ఇవ్వలేదు. కానీ పనులు ... మిగతా 8వ పేజీలో

నూకాంబిక జాతర ఆదాయం రూ.1.16 కోట్లు

గత ఏడాదితో పోలిస్తే రూ.26.39 లక్షలు అధికం

- అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిన జాతర
- ఉత్సవ ప్రత్యేకాధికారి కె.శోభారాణి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి. పక్కన ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఈవో రాంబాబు

అనకాపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి జాతర ఆదాయం గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది పెరిగిందని ఉత్సవ ప్రత్యేకాధికారి కె.శోభారాణి తెలిపారు. ఆమె శుక్రవారం ఇక్కడ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నెల రోజుల ఉత్సవంలో టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, విరాళాల రూపంలో ఈ నెల రోజుల్లో రూ.1,16,01,987 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది ఇదే సమయంలో రూ.89,62,827 ఆదాయం మాత్రమే వచ్చిందని చెప్పారు. ఈ ఏడాది 15 రోజులకు హుండీ ఆదాయం రూ.41,51,973 రాగా, గత ఏడాది 76 రోజులకు రూ.66,69,415 ఆదాయం లభించిందన్నారు. ఈ ఏడాది మరోమారు హుండీ లెక్కింపు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. ఈ ఏడాది అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నెల రోజులపాటు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో 3,200 మంది కళాకారులు తమ కళలను ప్రదర్శించారని చెప్పారు. ఇందుకు అయిన ఖర్చునంతటినీ కొణతాల రామకృష్ణ భరించారని చెప్పారు.

పగలు ఎండ తీవ్రత రాత్రి గాలులతో వర్షం

అనకాపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు రోజులుగా వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పగలు ఎండ తీక్షణంగా కాస్తుండగా, రాత్రిపూట ఈదురు గాలులతో వర్షం కురుస్తున్నది. గురువారం రాత్రి పలు మండలాల్లో ఈదురు గాలులతో వర్షం కురవగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ మండిపోయింది. గురువారం రాత్రి దేవరాపల్లి మండలంలో అత్యధికంగా 24.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చోడవరంలో 22.8, చీడికాడలో 19.6, రాంబిల్లిలో 18.6, కె.కోటపాడులో 12.6 మి.మీ.ల వర్షం కురిసింది. అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, రోలుగుంట, మాకవరపాలెం, మాడుగుల, ఎస్.రాయవరం, మునగపాక, ఎలమంచిలి, కోటవురట్ల, అచ్యుతాపురం, నక్కపల్లి, గొలుగొండ మండలాల్లో ఈదురు గాలులతో తేలికపాటి జల్లులు కురిశాయి.

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సమ్మె

- నిలిచిపోయిన 40 బస్సులు
- ప్రయాణికుల ఇక్కట్లు

అనకాపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా రవాణా శాఖ (పీటీడీ) అనకాపల్లి డిపో నుంచి బస్సులను ఆపరేట్ చేస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు శుక్రవారం సమ్మెకు దిగారు. దీంతో 40 బస్సులు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లి డిపోలో అద్దె వాటితోకలిపి మొత్తం 95 బస్సులు వున్నాయి. వీటిలో 25 బస్సులను అమరావతిలో ప్రధాని సభకు



ఆందోళన చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

ప్రజలను తరలించేందుకు గురువారమే పంపారు. శుక్రవారం అద్దె బస్సుల డ్రైవర్ల సమ్మెతో 40 బస్సులు రోడ్డెక్కలేదు. ఇక మిగిలింది 35 బస్సులే. దీంతో విశాఖపట్నం, విజయనగరం, పాయకరావుపేట, మాడుగుల, చోడవరం, దేవరాపల్లి, నర్సీపట్నం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం కాంప్లెక్స్‌లో గంటల తరబడి వేచివుండాల్సి వచ్చింది. బస్సు వచ్చిందే తడవుగా ప్రయాణికులు ఒక్కసారిగా ఎగబడుతున్నారు. గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలన్న ఉద్దేశంతో పలు వురు నిల్చుని ప్రయాణించారు. కాగా బస్సుల కొరతతో ప్రయాణికుల ఇక్కట్లపై ఆర్టీసీ ఏడీఎం రవిచంద్రను వివరణ కోరగా.. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు నర్సీపట్నం, విశాఖపట్నం, విజయనగరం డిపోల నుంచి 15 బస్సులను రప్పించినట్టు చెప్పారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

అద్దె బస్సుల డ్రైవర్ల డిమాండ్లు..

సమ్మె సందర్భంగా పలువురు డ్రైవర్లు మాటాడుతూ, ఒప్పంద ... మిగతా 8వ పేజీలో

ఉద్దండపురం ప్రాజెక్టుకు జలకళ

- 10 గ్రామాలకు నిరంతరం నీటి సరఫరా
- రూ.70 కోట్లతో రెండో దశ పనులు
- డిసెంబరులో మూడు మండలాలకు జలధార
- తీరనున్న నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండల ప్రజల నీటి కష్టాలు

నక్కపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. 2017 నుంచి 2019 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ 51 కోట్లతో నిర్మించిన మెగా వాటర్ ప్రాజెక్ట్ ప్రస్తుతం నీటితో కనువిందు చేస్తోంది. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మెగా వాటర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో రూ.20 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే వంగలపూడి అనిత అభ్యర్థన మేరకు నాటి పంచాయతీరాజ్‌శాఖా మంత్రి నారా లోకేశ్ ఉద్దండపురం మెగా వాటర్ ప్రాజెక్టుకు రూ.51 కోట్లు మంజూరు చేశారు. 2017 మే 5న ఉద్దండపురంలో మంత్రి నారా లోకేశ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం శరవేగంగా పనులు చేయడంతో మొదటి దశ పనులు అప్పట్లోనూ పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టుకు ఏలేరు కాలువ నుంచి (శరభవరం) జలాలు పైప్‌లైన్ ద్వారా వస్తున్నాయి. ఇందుకోసం 80 ఎకరాల్లో సువిశాలమైన ట్యాంక్‌ను నిర్మించారు. ప్రస్తుతం ఈ ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉంది. మొదటి దశలో నక్కపల్లి మండలంలో 10 గ్రామాలకు శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నారు. నక్కపల్లి మండలంలోని చినదొడ్డిగల్లు, వేంపాడు, వేంపాడు కొత్తూరు, ఉద్దండపురం, గొడిచెర్ల, జీ కొత్తూరు, సేరికొత్తూరు, డీ కొత్తూరు, జీ జగన్నాథపురం, డొంకాడ గ్రామాలకు ప్రతీ రోజూ ఈ మెగా వాటర్ ప్రాజెక్ట్ నుంచి తాగునీరు సరఫరా అవుతోంది.

రూ.70 కోట్లతో రెండో దశ పనులు

ఉద్దండపురం మంచినీటి ప్రాజెక్ట్ ద్వారా ప్రస్తుతం పది గ్రామాలకే నీరు సరఫరా అవుతోంది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని అన్ని గ్రామాలకు ఈ ప్రాజెక్ట్ నుంచి మంచినీటిని సరఫరా చేయాలని హోం మంత్రి అనిత కంకణం కట్టుకున్నారు. ఇందుకుగానూ గత పది నెలల నుంచి రూ.70 కోట్లతో రెండో దశ పనులు శరవేగంగా సాగుతున్నాయి. విశాలమైన ట్యాంకులు, రాపిడ్ శాండ్ పంప్‌హౌస్, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లకు ఉద్దండపురం ప్రాజెక్ట్ రెండో దశ యూనిట్‌ను అనుసంధానం చేయనున్నారు. ఆ పైప్‌లైన్ల ద్వారా నేరుగా నీటి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైనంత త్వరగా పనులు చేపట్టాలని, తన నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి తాగునీటిని అందజేయాలని హోం మంత్రి అనిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


ఉద్దండపురం వాటర్ ప్రాజెక్ట్ ట్యాంకులో పుష్కలంగా వున్న జలాలు

డిసెంబరు నాటికి పనులు పూర్తి
ప్రాజెక్ట్ డీఈఈ వై.ఆనంద్

ప్రస్తుతం ఉద్దండపురం వాటర్ ప్రాజెక్ట్ రెండో దశ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. రూ.70 కోట్లతో పనులు చేపడుతున్నాం. డిసెంబరు నెలాఖరుకు నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లోని పంచాయతీలు, శివారు గ్రామాలు కలిపి మొత్తం 140 గ్రామాలకు స్వచ్ఛమైన జలాలను అందిస్తాం.


పైప్‌లైన్ ద్వారా జలాలను పంపే ప్రదేశం


జలాలను శుద్ధి చేసే ప్రదేశం


ఉద్దండపురం వాటర్ ప్రాజెక్ట్ రెండో దశ పనులు

టీడీపీ నునపర్తి అధ్యక్షుడిగా శ్రీను

అచ్యుతాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా రెడ్డి శ్రీను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. టీడీపీ నాయకుడు రెడ్డి నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా మేడిశెట్టి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా కన్నూరు ఎర్రన్నాయుడు, కోశాధికారిగా యాంద్ర రాజు, సహాయ కార్యదర్శులుగా వియ్యపు నాగేశ్వరరావు, వెన్నెల లక్ష్మి, గెడ్డం విజయలక్ష్మి, కార్యదర్శులుగా దుప్పాడ రమేష్, రెడ్డి కన్నమనాయుడు, సిరంరెడ్డి సతీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ ఇన్‌చార్జిలుగా పితాన సతీష్, రెడ్డి ఎరుకునాయుడు, రెడ్డి శ్రీను, లాలం రమణబాబు, మేడిశెట్టి కనకఅప్పారావు, పోలవరపు నాగరాజులను నియమించారు. కార్యక్రమంలో గొంప నరసింహనాయుడు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

ఎలమంచిలిలో ఏమిటీ నిర్లక్ష్యం!

- చెట్ల కొమ్మలను కొట్టిన విద్యుత్ శాఖ సిబ్బంది
- వారం రోజులైనా తొలగించని మునిసిపల్ సిబ్బంది
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు

ఎలమంచిలి, మే 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో రెండు శాఖల మధ్య సమన్వయ లోపం పట్టణ ప్రజలకు శాపంగా మారింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు విద్యుత్ తీగలపై పడుతున్న చెట్లకొమ్మలను ఈపీడీసీఎల్ సిబ్బంది నరికివేశారు. ఆ కొమ్మలు వారం రోజులైనా రోడ్లపైనే ఉన్నాయి. దీంతో రాకపోకలకు పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎలమంచిలి మునిసిపాలిటీలో ఎనిమిదేళ్ల క్రితం పర్యావరణ పరిరక్షణలో భాగంగా చైర్‌పర్సన్ రమాకుమారి, మునిసిపల్ అధికారులు కలిసి వేలాది మొక్కలను పట్టణ వీధుల్లో నాటారు. అవి పెరిగి పెద్దవి అయ్యాయి. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఈ మొక్కలను విద్యుత్ లైన్ల కింద వేయడంతో అవి పెరిగి విద్యుత్ వైర్లకు తగలడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నది. దీంతో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి ఈపీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్నారు. ఆ విధంగా వారం రోజుల క్రితం చెట్ల కొమ్మలను ఈపీడీసీఎల్ సిబ్బంది తొలగించి, వాటిని అక్కడే వదిలివేశారు. ఈ వ్యర్థాలను వారం రోజులు అవుతున్నా మునిసిపల్ సిబ్బంది కూడా తొలగించలేదు. దీంతో రోడ్లపై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఉన్న చెత్త చెదారాన్ని తొలగించాల్సిన మునిసిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంపై పట్టణ వాసులు మండిపడుతున్నారు. ఈ పని మాది కాదంటే.. మాది కాదంటూ ఈ రెండు శాఖల అధికారులు రోడ్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించకుండా వారం రోజులుగా రోడ్ల పక్కనే వదిలేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ఎలమంచిలిలో విద్యుత్ సిబ్బంది తొలగించిన చెట్లకొమ్మలు

కేజీబీవీలో ఎంఎల్‌టీ జిల్లా టాపర్‌కు కలెక్టర్ అభినందన


రజినికి జ్ఞాపికను అందజేసున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

రాంబిల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్ రెండో సంవత్సరం ఎంఎల్‌టీలో జిల్లా టాపర్‌గా నిలిచిన సీహెచ్ రజిని (970/1000)ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం అభినందించి, జ్ఞాపికను అందజేశారు. రాంబిల్లి కేజీబీవీలో టెన్త్ ఫలితాలు శతశాతం రావడంతో ప్రిన్సిపాల్ జి.ప్రమీల, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీర్ల పంజా భూమిని కాపాడండి

- పెదబోదిగల్లం ముస్లిం మత పెద్దలు

నక్కపల్లి,మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలోని సర్వే నంబరు 143/2లో 3.06 ఎకరాలు దురాక్రమణ కాకుండా చూడాలని ఆ గ్రామ ముస్లిం మత పెద్దలు కోరారు. భవిష్యత్తులో తమ అవసరాల కోసం ఆ స్థలాన్ని కేటాయించామని పేర్కొన్నారు. శుక్రవారం వక్ఫ్ బోర్డు అధికారులు పీర్ల పంజా భూములకు సంబంధించి ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, సర్పంచ్ మున్నీషా బేగం, అజీమ్ తదితరులు వక్ఫ్ బోర్డు ప్రతినిధులతో మాట్లాడారు. గత వందేళ్ల నుంచి పీర్ల భూమి తమ అవసరాల కోసం ఉంచితే కొందరు వ్యక్తులు ఆ భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పీర్ల పంజాభూమి దురాక్రమణకు గురికాకుండా చూస్తామని వక్ఫ్‌బోర్డు అధికారులు నజీర్ సాహెబ్,అహ్మద్ మొహిద్దీన్ చెప్పారు.ఈ విషయాన్ని తాను హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్తానని కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు.


వక్ఫ్ బోర్డు ప్రతినిధులతో సమావేశమైన స్థానిక ముస్లిం మతపెద్దలు, టీడీపీ నేత వెంకటేశ్

పాడి రైతులకు గడ్డి విత్తనాలు

- జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రామ్మోహనరావు

కోటవురట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు గడ్డి విత్తనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో కోటవురట్ల, మాకవరపాలెలం మండలాలకు చెందిన పశువైద్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు మండలాల్లో పాడి పశువు ఉన్న డ్వాక్రా మహిళలకు అదనంగా మరో పడి పశువు కొనుగోలుకు రుణం ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. అలాగే కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న గిరిజన మహిళలకు 15 కోడిపిల్లలు, 50కేజీలు దాణా ఉచితంగా అందజేస్తామన్నారు. ఇందుకు కోటవురట్ల మండలంలో కైలాసపట్నం గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెట్ల నరేష్, తంగేడు, పాములవాక, కొడవటిపూడి డాక్టర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం ప్రారంభం

రాంబిల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో సీఎస్‌ఆర్ నిధులు రూ.50లక్షలతో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, ఈవోపీఆర్డీ రాజు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనీల్‌కుమార్, వైసీపీ మండల మాజీ అధ్యక్షులు జి.శ్రీనుబాబు, నేతలు నాని, వెంకటరావు, సన్యాసిరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

కనీస జాగ్రత్తలతో వేసవి నుంచి ఉపశమనం

- ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ రఘు



నక్కపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి):వేసవిలో ఎండ తీవ్రత, వడదెబ్బ తగలకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.రఘు సూచించారు. గురువారం వేంపాడు ఆయుష్ ఆస్పత్రిలో పలువురు రోగులకు ఎండ తీవ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి రోజూ పల్చని కాటన్ దుస్తులను ధరించాలని, తలకు టోపీ ధరించి, ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ , కొబ్బరినీరు తాగాలని సూచించారు. తల తిరగడం, విపరీతమైన తలనొప్పి, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ లేదా అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని చల్లని నీడ వున్న ప్రదేశానికి తీసుకెళ్లి, శరీరమంతా తడిగుడ్డతో తుడవాలన్నారు. వడదెబ్బ లక్షణాలున్నప్పుడు ప్రభుత్వాసుపత్రులకు వెళ్లడం మంచిదని డాక్టర్ రఘు సూచించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో మండలంలోని పీఎల్.పురం రైల్వే గేటు వద్ద శుక్రవారం ఉదయం రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. తుని, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య పీఎల్.పురం రైల్వే గేటు వద్ద శుక్రవారం ఉదయం రాజమహేంద్ర వరం నుంచి విశాఖ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతుడి వంటిపై వంగపండు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, బూడిద రంగు ఫుట్ ప్యాంట్ ఉన్నాయని, రైల్వే పట్టాలకు దగ్గరగా మొబైల్ ఫోన్ ఉంది తప్ప మృతుడి వద్ద ఇతర వివరాలు ఏమీ లేవని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీ రూమ్‌లో భద్రపరిచామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు. తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌కు తెలపాలని ఆయన కోరారు.

ఇంటిపై కూలిన కొబ్బరి చెట్టు

ఏడు నెలల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఎలమంచిలి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున కొబ్బరి చెట్టు ఇంటిపై కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున ఈదురు గాలులు వీయడంతో చెట్టు కూలిపోయిందని స్థానికులు తెలిపారు. పంచాయతీ స్థలంలో ఉన్న కొబ్బరి చెట్టు మొదలు బాగా దెబ్బతిందని, దానిని తొలగించాలని ఏడు నెలల క్రితం గ్రామస్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు స్థానిక నేత రాజాన రఘు తెలిపారు. ఈ చెట్టు కూలిపోయిన సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


రేగుపాలెంలో ప్రధాన రోడ్డు పక్కన ఇంటిపై కూలిన తాటి చెట్టు

మరిడిమాంబ ఉత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


మరిడి మాంబ అమ్మవారి వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): మునగపాక మండలం యాదగిరిపాలెంలోని మరిడిమాంబ అమ్మవారి ఉత్సవ వాల్‌పోస్టర్‌ని శుక్రవారం అచ్యుతాపురం స్వగృహంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆవిష్కరించారు. ఈనెల ఎనిమిదిన అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ తిమ్మరాజుపేట గ్రామ కమిటీ ఏకగ్రీవం


తిమ్మరాజుపేటలో ఎన్నికైన టీడీపీ గ్రామ కమిటీ సభ్యులు

అచ్యుతాపురం రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం నిర్వహించిన టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కర్రినాయుడు, అధ్యక్షులుగా కర్రి భద్రరాజులు, ఉపాధ్యక్షులుగా వెలగ అచ్చింనాయుడు, ప్రధాన కార్యదర్శిగా కర్రి వెంటకునాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శరగడం మాధవి, దాడి పుణ్యవతి, సెక్రటరీలుగా రేవిడి విజయలక్ష్మి, శరగడం వీరభద్రరావు, అపేటి చిన్న, క్యాషియర్‌గా అలమండ సత్తిబాబు, 180 బూత్ ఇన్‌చార్జిలుగా కర్రి కుమార్‌స్వామి, కర్రి వెంకటేష్, ఐటీడీపీ ఇన్‌చార్జిగా దాడి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ కమిటీ ఏకగ్రీవం కావడం పట్ల టీడీపీ బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు హర్షం వ్యక్తం చేశారు.

పద్య పఠనంతో తెలుగు భాషపై పట్టు

- విశ్రాంతి ఉపాధ్యాయుడు కిల్లాడి ప్రసాదరావు


పద్యాలపై శిక్షణ ఇస్తున్న విశ్రాంతి ఉపాధ్యాయుడు ప్రసాదరావు

మునగపాక, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఉచ్ఛరణ, పరిజ్ఞానం పెంపునకు పద్యాల సాధన ఎంతగానో దోహదం చేస్తుందని విశ్రాంతి ఉపాధ్యాయుడు కిల్లాడి ప్రసాదరావు తెలిపారు. స్థానిక గౌతమ పఠన మందిరంలో శుక్రవారం వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మందిరం కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సౌందర్యలహరి, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు అబాకస్‌పై శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు తెలుగు పద్యాలపై అవగాహన కల్పించారు. మందిరం అధ్యక్షుడు దాడి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మారిశెట్టి అప్పారావు, కె.మోహన్‌రావు, ఆడారి లక్ష్మణరావు, దాడి శ్రీరామ్మూర్తి, కె.సూర్యనారాయణ, కోనపల్లి రామ్మోహన్‌రావు, దాడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిశోర్ వికాసంపై అవగాహన

కోటవురట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోర్ వికాసంపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వీవోఏలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కోటవురట్ల శివారు గొల్లపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలు శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తారు. కిశోర్ వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి, విద్య నైపుణ్యం, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత, తదితర 12 అంశాలపై 12 రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యఆరోగ్య సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన


సంపద కేంద్రంలో వర్మి కంపోస్టును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉన్న సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పరిశీలించారు. మండలంలో ఎస్.నర్సాపురం, పాల్తేరు, పెదరాంభద్రపురం పంచాయతీల్లో పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాల ఇచ్చారు. అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఇంటి పన్నుల వసూలు, స్వచ్ఛ ఆంధ్రా, స్వర్ణ ఆంధ్రా తదితర కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నుయ్యిలో జారి పడి వివాహిత మృతి

ఎస్.రాయవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పిట్ల రేవతి (22) అనే వివాహిత ప్రమాదవశాత్తు నుయ్యిలో జారిపడి మృతి చెందినట్టు శుక్రవారం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన రేవతి గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పశువుల మకాం వద్ద ఉన్న తాత వీర్రాజుకు భోజనం తీసుకు వెళ్లింది. తరువాత పశువులకు నీటి కోసం అక్కడకు సమీపంలో ఉన్న నుయ్యి వద్దకు వెళ్లి నీరు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయింది. అయితే సాయంత్రం అవుతున్నా తన అక్క కనిపించలేదని ఆమె సోదరుడు గింజల హరీష్ రాత్రి ఏడు గంటల సమయంలో తాత వీర్రాజుతో కలిసి నుయ్యి వద్దకు వెళ్లి చూడగా రేవతి మృతదేహం కనిపించింది. ఈ మేరకు హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చినుకు పడితే చెరువే..!

» దుర్భరంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ » ఎక్కడికక్కడ నిలిచిపోతున్న నీరు » మురుగుగా మారి దుర్వాసన, దోమల బెడద » అవస్థలు పడుతున్న ప్రయాణికులు, సిబ్బంది



డిపో ముందు వర్షపు నీరు నిలిచిపోవడంతో మహిళా కండక్టర్ల అవస్థలు

అనకాపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ దుర్భరంగా మారింది. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఆ నీరు కాంప్లెక్స్ ఆవరణలో ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఫలితంగా ప్రయాణికులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంస్థ ఇన్‌గేటు మధ్యలో నీరు నిలిచిపోవడం మరిన్న సమస్యలకు కారణమవుతోంది. అలాగే డిపోకు వెళ్లే మార్గంలో, డిపోకు ఆనుకొని ఉన్న ప్రదేశంలో రోజుల తరబడి నీరు నిలిచిపోయి మురుగుగా మారుతోంది. దీంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడద తీవ్రంగా ఉంది. కంట్రోల్ రూమ్‌కు ఎదురుగా ఉన్న ఆవరణలో మురుగు తాండవిస్తోంది. పట్టణంతో పాటు వివిధ మండలాల నుంచి ఇక్కడికి విచ్చేసి రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు కాంప్లెక్స్ ఆవరణలోని పరిస్థితులను చూసి ఆశ్చర్యంతో పాటు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్డుకు కాంప్లెక్స్ ఆవరణ పల్లంగా ఉండడంతో అడపా దడపా వర్షాలు కురుస్తున్న సమయంలో కాంప్లెక్స్ ఆవరణ అంతా చెరువును తలపిస్తోంది. భారీ వర్షాలు కురిస్తే ప్లాట్‌ఫారాలపైకి వర్షపునీరు చొచ్చుకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇటువంటి సమయాల్లో ప్రయాణికులు, డిపోలోకి వెళ్లేందుకు సిబ్బంది ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటాయి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నీరు నిల్వ లేకుండా కాంప్లెక్స్ ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాల్సిందిగా ప్రయాణికులంతా కోరుతున్నారు. ఈ సమస్యను ఏడీఎం రవిచంద్ర వద్ద ప్రస్తావించగా, కాంప్లెక్స్‌లో నుంచి నీరు పోవడానికి ఉన్న డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. మున్సిపాలిటీలోని డ్రైనేజీ నీరు కూడా కాంప్లెక్స్ ఆవరణలోకి వచ్చే విధంగా ఉందని తెలిపారు. ఈ సమస్యపై చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు పలుమార్లు కోరినా స్పందించలేదన్నారు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడల్లా కాంప్లెక్స్ ఆవరణలో ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. .



బస్సులు నిలిపే ప్రదేశంలో దుస్థితి

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

» పరవాడ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి సూచన

» సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి

పరవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి సూచించారు. శుక్రవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.ధర్మారావు అధ్యక్షతన పరవాడ మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి విషయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పరవాడ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిరాం మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్క, పాము కాట్లకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పరవాడ సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు మాట్లాడుతూ గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలో గల జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి శ్మశానవాటిక స్థలాన్ని పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో కేటాయించడం తగదన్నారు. దీనిపై తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ మాట్లాడుతూ గొర్లివానిపాలెం పరిధిలో స్థలం లేకపోవడం వలన పరవాడ రెవెన్యూలో కేటాయించాల్సి వచ్చిందని, అక్కడి ప్రజలకు ఇబ్బంది ఉంటే స్థలాన్ని వేరే చోట కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ జి.షణ్ముఖ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా మండల వ్యాప్తంగా 64 చేతిబోర్లును రిపేర్ చేయడం జరిగిందన్నారు. శిథిలావస్థలో ఉన్న మంచినీటి పథకం ట్యాంకును తొలగించాలని పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పన సభలో కోరారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఎక్కువగా ఉన్నా యని రావాడ సర్పంచ్ మొటూరు సన్యాసినాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. రావాడ సచివాలయం పక్కనే బెల్టు దుకాణాన్ని నడుపుతున్న విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ రమణ సమాధానమిస్తూ బెల్టుషాపుల పై దాడులు జరిపి 360 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, 60 మందిపై కేసులు నమోదు చేశామని వివరించారు. పంచాయతీ రాజ్ ఏఈ కుమార్‌రాజా మాట్లాడుతూ మండలంలోని మూలస్వయంభూవరం, వెంకటాపురం, గొల్లలపాలెం రహదారుల మరమ్మతుకు నాబార్డు నుంచి రూ.2.4 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గ్రామాల్లో మంచినీటి క్లోరినేషన్‌కు ఎంపీటీసీల నిధులు నుంచి కేటాయించలేమని పరవాడ ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు అన్నారు. తహసీల్దార్ అంబేడ్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపితే తక్షణమే ప్రజా ప్రతినిధులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఏవో రాంబాబు, వైస్ ఎంపీ పీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సమస్యలపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ధర్నా

అనకాపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నెహ్రూచౌక్ వద్ద గల ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్, రాష్ట్ర అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు దాటిన ప్రతి సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని. ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోలు భవాని, పి.రేవతి, జి.యమున, పి.కల్యాణి, కె.అశ్విని, బి.సుధాకర్, పి.రాజశేఖర్, సీహెచ్.స్వామి, ఆర్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుంచంగి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కొత్తూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : కుంచంగిలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ సీనియర్ నాయకుడు బొలిశెట్టి శ్రీను హాజరై గ్రామ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా పోలిన సూర్యజగ్గారావు, ఉపాధ్యక్షుడిగా పల్లెల జగన్నాథం, ప్రధాన కార్యదర్శిగా సియ్యాద్రి నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చిన్ని శ్రీను, అర్జునుడు, పోలిన నాగు, కోశాధికారిగా పల్లెల ఈశ్వరరావుతో పాటు మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం యన్నంశెట్టి రాముకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి బాబీ, రొంగలి సూరిబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

అనకాపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకా పల్లి నూకాంబిక అమ్మవారిని మహిళలు, బాలలు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు నూకాంబిక జాతర ప్రత్యేకాధికారిణి శోభారాణి, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు స్వాగతం పలికారు. బాలాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న సూర్యకుమారి

చెన్నై చేరిన సర్కారు సంక్షేమం

» ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు పింఛన్ అందజేత



సుష్మితకు పింఛన్ నగదు అందిస్తున్న దృశ్యం

పరవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తానాం గ్రామానికి చెందిన నేతల సంతోష్, కుమారి దంపతుల కుమార్తె సుష్మిత సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి బారిన పడి ఆపరేషన్ నిమిత్తం మూడు నెలల క్రితం తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై ఎంజీఎం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యాధి కావడంతో ప్రభుత్వం ప్రతి నెలా రూ.10వేలు పింఛన్ అందిస్తుంది. అయితే రెండు నెలలు పూర్తయి మూడవ నెల పింఛన్ తీసుకోకపోతే ఆ సొమ్ము వెనక్కి వెళ్లిపోతుంది. దీంతో బాలిక కుటుంబం ఈ సమస్యను మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. వీరిరువురూ కలిసి పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్‌తో చర్చించి సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ లక్ష్మణ్, టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి పొట్ల కృష్ణకు రవాణా ఖర్చులకు డబ్బులు ఇచ్చి చెన్నై పంపించారు. అక్కడ చికిత్స పొందుతున్న సుష్మితకు రెండు నెలల పింఛన్ నగదును శుక్రవారం వారు అందజేశారు. తమ కుమార్తెకు చెన్నై వచ్చి పింఛన్ అందేలా సహకరించిన వారికి సుష్మిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌ల ఆందోళన

» సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నినాదాలు

అనకాపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి (డీఎం హెచ్‌వో) కార్యాలయం వద్ద శుక్రవారం 102 తల్లీబిడ్డ కెప్టెన్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రైవర్లకు పదేళ్లుగా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదన్నారు. సమస్యల పరిష్కారంపై అరవిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఉద్యోగులందరూ ఆకలితో అలమటిస్తున్నా పట్టించుకునే నాథులే లేరన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు, ఇంక్రిమెంట్లు, పని ఒత్తిడి వంటి డిమాండ్లపై 20వ తేదీ నుంచి సమ్మె నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింగరావు, శ్రీను పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కెప్టెన్‌లు

వైసీపీ నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవం రేపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి నియోజకవర్గ వైసీపీ కేంద్ర కార్యాలయం ఈ నెల నాలుగో తేదీన అనకాపల్లి రోడ్డులోని ఇరువాడ పెట్రోలు బంకు సమీపంలో ప్రారంభించనున్నామని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హాజరై ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులంతా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి రవికుమార్, కొటాన రాము, పాలిశెట్టి సురేశ్‌రాజ్, కర్రి బాబు, ఎస్. ముత్యాలనాయుడు, వి.అచ్చింనాయుడు, డి.శ్రీను, వి.అప్పలరాజు, పి.రమేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని పెయింటర్ మృతి



కృష్ణ మృతదేహం

పరవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): వివాహం కాలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందాడు. గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన గండేపల్లి కృష్ణ (30) అవివాహితుడు. ఆయన తల్లి రమణమ్మతో కలిసి కాలనీలో నివాసం ఉంటున్నారు. పెయింటర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వివాహం కాలేదన్న కారణంతో మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజూ ఇంటికి తాగొచ్చి పెళ్లి విషయమై తల్లితో గొడవ పడేవాడు. ఇదే మాదిరిగా గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికొచ్చిన అతను తల్లితో గొడవ పడ్డారు. దీంతో కొడుకు వేధింపులు భరించలేక ఆమె అదే కాలనీలో వేరే ఇంట్లో ఉన్న కుమార్తె తోటకూర అనసూయ ఇంటికి వెళ్లిపోయింది. మద్యం మత్తులో ఉన్న కృష్ణ ఇంట్లో తలుపులు వేసుకొని లోపల బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన తల్లికి ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కొడుకు మృతదేహం కంట పడింది. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని కిందకు దించారు. మృతుడి సోదరి అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

890 గ్రాముల బంగారం, రూ. ఏడు లక్షల నగదు సీజ్

సబ్బవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి పత్రాలు లేకుండా మండల కేంద్రం మీదుగా తరలిస్తున్న 890 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 7లక్షల నగదును సబ్బవరం పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం ఎస్ఐ పి.సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మూడు రోడ్ల కూడలి వద్ద గురువారం రాత్రి ఎస్ఐ సింహాచలం, మరో ఎస్ఐ దివ్య, సిబ్బంది పరదేశినాయుడు, ఆర్కే నాయుడు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో చోడవరం నుంచి విశాఖ వెళుతున్న ఆర్టీసీ బస్సులో పొట్నూరి నాగేశ్వరరావు అనే వ్యక్తి సూట్‌కేసులో 890 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.7లక్షల నగదుతో పట్టుబడ్డారు. అతన్ని స్టేషన్‌కు తరలించి విచారించగా.. విశాఖలోని శ్రీజ్యూలర్స్ నుంచి చోడవరంలో ఒక జ్యూలర్ షాపునకు ఆభరణాలు ఇచ్చి, తిరిగి విశాఖ వెళుతున్నట్టు విచారణలో వెల్లడైందన్నారు. అయితే ఆభరణాలు, నగదుకు సంబంధించిన ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి శుక్రవారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచినట్టు చెప్పారు. ఆభరణాలు, నగదుకు సంబంధించిన సరైన పత్రాలు మేజిస్ట్రేట్ ముందుంచి వాటిని తిరిగి తీసుకోవచ్చునని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

సబ్బవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని స్థానిక గ్రంథాలయాధికారిణి వి.శిరీష అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ రెండు పూటలా విద్యార్థులు కనీసం అరగంట పాటైనా ఆటలు ఆడాలన్నారు. అప్పుడే మంచి ఆరోగ్యవంతులుగా ఉంటారని వివరించారు. అనంతరం వారితో పుస్తకాలు, పత్రికలను చదివించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రత్నకుమారి, పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మూలపేట పూడివారి వీధిలో మురుగు సమస్య



గ్రామంలో కాలువ నిండిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

కొత్తూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో గల పూడివారి వీధిలో కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు గ్రామంలో డ్రైనేజీలపై వేసిన పలకలు శిథిలావస్థకు చేరడంతో వాటికింద చెత్తా చెదారం పేరుకుపోయి చిన్నపాటి వర్షానికే మురుగు ఇళ్లలోకి చేరుతోందని వాపోతున్నారు. అంతేకాకుండా డ్రైనేజీల నుంచి వస్తున్న దుర్వాసనను భరించ లేకపోతున్నామని అంటున్నారు. దీనికి తోడు దోమలు పెరిగిపోవడంతో కంటిపై సరిగా కునుకు ఉండడం లేదని చెపుతున్నారు. పంచాయతీ దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్లినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించాల్సిందిగా గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోన లక్ష్మణ కోరారు. లేనిపక్షంలో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు



సారాతో మహిళను పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది

కశింకోట, మే 2 (ఆంధ్రజ్యోతి) : జమ్మాదులపాలెం శివారున నాటుసారా విక్రయిస్తున్న మహిళను పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ లక్ష్మన్నాయుడు తెలిపారు. ముందస్తు సమాచా రం మేరకు శుక్రవారం గ్రామంలో తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా, కరక చిలకమ్మ రెండు లీటర్ల సారాతో పట్టుబడిందన్నారు. వెంటనే అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎస్.వి.నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

50 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ తదితరులు

గొలుగొండ, మే 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో 50 కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ గొలుగొండ మండలం పాకలపాడు జంక్షన్ వద్ద గొలుగొండ ఎస్ఐ రామారావు, సిబ్బందితో శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా కారులో గంజాయిని రవాణా సాగిస్తున్నట్టు గుర్తించారన్నారు. అల్లూరి జిల్లా నుంచి కారులో 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కొన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాకు చెందిన కర్రి అప్పన్న, కర్రి రాజు, కర్రి రాధలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్టు చెప్పారు. కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. గొలుగొండ ఎస్ రామారావు, పోలీసులను డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీలో వీధి లైట్లకు మరమ్మతులు



లైట్ల మరమ్మతు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

పరవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని వారు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించిన శుక్రవారం కాలనీలో పర్యటించారు. వీధిలైట్లకు దగ్గరుండి మరమ్మతు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరులో నిర్వహించిన ఆందోళన మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి



అరకులోయలో బైఠాయించిన నిరుద్యోగ యువత, గిరిజన, పలు పార్టీల నాయకులు

మన్యం బంద్ విజయవంతం

- ప్రత్యేక డీఎస్సీతోనే గిరిజన అభ్యర్థులకు న్యాయం: గిరిజన సంఘ, ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ నాయకులు
- రాస్తారోకోలు, బైఠాయింపు, దుకాణాలు మూత

పాడేరురూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. ఉదయం ఐదు గంటలకే సీపీఎం, గిరిజన సంఘం, విద్యార్థి సంఘాల నేతలు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని బస్సులను స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, బంద్ నిర్వాహకుల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తపరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా గిరిజన సంఘం కేంద్ర కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధించుకొనేందుకు గిరిజన ప్రాంత నాయకులంతా పోరాడాలని కోరారు. ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న ఈ పోరాటం ఢిల్లీ స్థాయిలో వినిపించాల్సి ఉందన్నారు. ఢిల్లీలో త్వరలో చేపట్టనున్న ఆందోళనకు ఉద్యమకారులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. బంద్ నేపథ్యంలో రహదారులపై బైఠాయించడంతో జనజీవనం స్తంభించింది. ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బంద్ విజయవంతానికి కృషి చేశారు. పట్టణ వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి బంద్‌కు సహకరించారు. బ్యాంక్‌లు, పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయి. భోజన, టిఫిన్ హోటల్స్ మూతపడటంతో ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుడుముల కాంతారావు, ఆర్.జగన్మోహన్‌రావు, ఎస్.మా ణిక్యం, కె.సురేంద్ర, ఎల్.సుందరరావు, బాలదేవ్, చిన్నయ్యపడాల్, కూడా రాధాకృష్ణ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం వరకు ఆర్టీసీ బస్సులు కాంప్లెక్స్‌కే పరిమితమయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు విధులు వెళ్లలేకపోయారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో శుక్రవారం ఉదయం నుంచే లంబసింగిలో ఆందోళన కారులు రహదారికి అడ్డంగా బైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. చింతపల్లిలో ఉదయం 9 వరకు దుకాణాలు యథావిధిగా తెచుకున్నాయి. పలు సంఘాల నాయకులు దుకాణాలను మూయించేశారు. పలు గ్రామాల్లో బంద్ ప్రభావం పాక్షికంగా కనిపించింది. చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. హనుమాన్ జంక్షన్‌లో దండకారణ్య విమోచన సమితి, గిరిజన సంఘం, వైసీపీ నాయకులు ఆందోళన చేశారు. అవాంఛనీయ సంఘటలు చోటుచేసుకుండగా స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా పర్యవేక్షణలో సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐలు వెంకటరమణ, వెంకటేశ్వరరావు, పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 నుంచి యథావిధిగా వాహనాలు తిరిగాయి. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాయల్మ, గిరిజన సంఘం నాయకులు చిన్నయ్యపడాల్, పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, ఉద్యోగ సంఘాల నాయకులు బౌడు గంగరాజు, కుడుముల వెంకట రమణ, దండకారణ్యసమితి నాయకులు కుడుముల శేఖర్, కాసులమ్మ, వెంకయమ్మ, వైసీపీ నేత జల్లి సుధాకర్ పాల్గొన్నారు.

జీకే వీధిలో...

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం



అనంతగిరిలో బైఠాంచిన నాయకులు

వరకు దుకాణాలు తెరుచుకోలేదు. ఇతర గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి తెరుచుకున్నాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు తిరుగలేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మండల కేంద్రంలో ఎంపీపీ బోయిన కుమారి, రింతాడ ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు సిద్దార్ మార్కె, సీపీఎం నాయకులు సత్యనారాయణ, బుజ్జిబాబు, వైసీపీ మండలాధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: జీవో 3 పునరుద్ధరణతో పాటు గిరిజనులకు స్పెషల్ డీఎస్సీకు ఆర్డినెన్సు తీసుకు రావాలనే డిమాండుతో ఆదివాసీ గిరి జన సంఘం, స్పెషల్ డిఎస్సీ పోరాట కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన మన్యం బంద్ మండలంలో పాక్షికంగా ప్రశాంతంగా ముగిసింది. కొయ్యూరులో ఎంపీపీ బడుగు రమేశ్ బాబు, సీపీఎం నేత సూరిబాబు, సీపీఐ నేత దేముడు ఆదివాసీ గిరిజన సంఘ నేత అశోక్‌లాల్ ఆధ్వర్యంలో కొయ్యూరులో రాస్తారోకో నిర్వహించారు. దుకాణాలను మూసివేయించారు. అనంతరం కాకరపాడు కూడలిలో జాతీయ రహదారిపై బైఠాయించారు. స్పందించి స్థానిక ఎస్ఐ కిశోర్ వర్మ బంద్‌తో జనజీవనానికి అంతరాయం కలుగుతుందని, వ్యాపార సంస్థలు తీయించారు. డౌనూరు కూడలిలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు బిడజాన అప్పారావు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నేతలు ధర్మరాజు, ఆదివాసీ గిరిజన సంఘ నేతలు రుత్తల శివప్రసాద్ తదితరులు ఆధ్వర్యంలో పధాన రహదారిపై బైఠాయించారు. కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

హుకుంపేటలో..

హుకుంపేట; గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని స్థానిక వైస్ ఎంపీపీ కొండలరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్. హైమవతి డిమాండ్ చేశారు. శుక్రవారం హుకుంపేటలో బంద్‌ను విజయవంతమైంది. బంద్‌తో వాహన రాక పోకలునిలిచి మండల కేంద్ర నిర్మానుష్యంగా మారింది. బంద్‌కు మద్దతుగా వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం, సీపీఎం, వైసీపీ నేతలు బత్తిరి రవి ప్రసాద్, గండేరు సత్యం, కృష్ణారావు, కంభ పోట్టిబాబు, వాసు, మత్స్యరాజు సర్పంచ్ రంజిత్,పెసా సభ్యులు చపాలి శంకర్ వెంకటరమణ, అప్పాల కొండ , నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో

డుంబ్రిగుడ: మండ కేంద్రంలో దుకాణాలు, పెట్రోల్ బంక్, చాపరాయి జలవిహారి మూతపడ్డాయి. కించుమండ, అరకు, గుంటసీమ, కోర్రా, ఒంటిపాక జంక్షన్‌లో నిరుద్యోగ యువత రోడ్డుపై బైఠాయించారు. జీవో 3 అమలు చేసి ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా



డుంబ్రిగుడలో ఆకులు చుట్టుకుని నిరసన తెలుపుతున్న నిరుద్యోగ యువత

గిరిజన అభ్యర్థుల నియామకాలు చేపట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అరకు వారపు సంతలో బంద్ పాటించారు. కార్యక్రమాల్లో గిరిజన సంఘం నాయకులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు న్యాయం చేయాలి: ఎమ్మెల్యే మత్స్యలింగం

ముంచంగిపుట్టు: ప్రభుత్వం గిరిజన స్పెషల్ డీఎస్సీ ప్రకటించి, ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం డిమాండ్ చేశారు. శుక్రవారం చేపట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. వాహన రాకపోకలు జరగలేదు. నాలుగు రోడ్ల కూడలిపై నేతలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, డీఎస్సీ సాధన సమితి, వివిధ పార్టీలు, సంఘాల నేతలు ఎం.ఎం.శ్రీను, కె.త్రినాథ్, జేవీవీఎస్ మూర్తి, సుభాష్, జగన్, నీలకంఠం, వెసీపీ, కాంగ్రెస్, తదితరులు పాల్గొన్నారు.

జి. మాడుగులలో..

జి.మాడుగుల: జి.మాడుగులలో ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ మండల కన్వీనర్ మత్స్యరాస నారాయణ రాజు ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులతో పాటు నిరుద్యోగులు పెద్ద ఎత్తున ప్రధాన రహదారి నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యాపార సముదాయాలు, ప్రైవేటు వాహనాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. ధర్మన పడాల్, ఎస్.కోటిబాబు, జె. దీనబంధు, ఎల్.రామకృష్ణ, జే.దేముళ్లు, మత్స్యరాజు, చిన్నారావు, ఎన్. మత్స్యకొండంనాయుడు, జి.సన్యాసిదొర పాల్గొన్నారు.

అనంతగిరిలో

అనంతగిరి: మండలం కేం ద్రంలో రోడ్డుపై నాయకులు బైఠాయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ ద్వారానే జీవో 3 సాధ్యమతువుందని చెప్పారు. అంత వరకు ప్రత్యామ్నాయంగా జీవో ద్వారా గిరిజన నిరుద్యోగులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలోని వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన, వైసీపీ నాయకులు సూర్యనారయణ, స్వామి, రామలక్ష్మి, గంగన్నదొర, మోస్య, నాగులు, సన్యాసిరావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో బంద్ విజయవంతం

సీలేరు: స్థానిక మేజర్ పంచాయతీలో వర్తకులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు నిలిచిపోయాయి. నిరుద్యోగ యువకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. ఆదివాసీ నాయకులు మండి చంద్రయ్య, బల



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ముంచంగిపుట్టులో ఎమ్మెల్యే మత్స్యలింగ్ ఆధ్వర్యంలో ఆందోళన

రామ్, వంతల వెంకటరావు పాల్గొన్నారు.



హుకుంపేటలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొండలరావు



జి. మాడుగులలో..



జి. కె. వీధిలో.



పాడేరులో రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, నేతలు



మాట్లాడుతున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అరకులోయలో..

అరకులోయ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో మంద్ విజయవంతమైంది. అరకులోయలోని పర్యాటక కేంద్రాలు ట్రైబల్‌మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కాఫీ మ్యూజియం,రిసార్టులు, దుకాణాలన్నీ మూతబడ్డాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ జీపులు, ఆటోల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ బంద్‌లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, కిండంగి రామారావు, సీఐటీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఆదివాసీ జననాట్యమండలి బృందం జోషిలతో పాటు ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్, కాంగ్రెస్ నాయకురాలు పాచిపెంట శాంతికుమారి, పలు ఉద్యోగ, ఉపాధ్యా.కార్మిక, ప్రజాసంఘాల నేతలు బంద్‌లో పాల్గొని మద్దతునిచ్చారు. పద్మాపురం పంచాయితి పరిధిలో నిరుద్యోగ యవతి, యువకులు, డీఎస్సీ అభ్యర్థులు, పంచాయతీ పెద్దలు తదితర 150 మంది కి పైగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ తో ఆదివాసీలకు ఎటువంటి ప్రయోజనం లేదని ఐటీడీఏ పరిధిలో 766 పోస్టుల్లో ఆదివాసీలకు దక్కేది కేవలం 42 పోస్టులు మాత్రమేనని అన్నారు. ఈ బంద్‌లో ఎమ్మెల్యే రేగం మత్సలింగం, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు, వైసీపీ నాయకులు పాల్గొని వారి మద్దతు తెలిపారు. అయితే, ఆదివాసీ , స్పెషల్ డీఎస్సీ నియామక కమిటీ ప్రతినిధులు పక్కకు జరిగి వెళ్లిపోయి వారంతా ప్రత్యేకంగా నిరసన చేపట్టడంతో వైసీపీ నేతలు ఖంగుతిన్నారు.



కొయ్యూరు:కాకరపాడు కూడలిలో జాతీయ రహదారిపై ధర్నా



సీలేరులో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నిరుద్యోగ యువత



చింతపల్లిలో దుకాణాలు మూసివేయిస్తున్న డీఎల్‌వో నాయకులు

తేనె టీగల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

జి.మాడుగుల, మే 2 (ఆంధ్రజ్యోతి) : తేనే టీడల దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో నుర్మతి పంచాయలో చోటు చేసుకుంది. గడుతూరు పంచాయతీ ఏనుగొంది గ్రామానికి చెందిన బురిటి కొండబాబు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నుర్మతి పంచాయతీ చెరువీధి గ్రామానికి బంధువుల ఇంట్లో పండగా కోసం కాలినడకన వెళ్తున్నారు. నుర్మతి, చేరువీధి గ్రామాల మధ్యలో తేనెటీగలు ఒక్కసారిగి దాడి చేయడంతో కొండబాబు (50)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీలు ధనుర్జాయి, కె. పోతురాజు జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

కిశోర బాలికల వికాసం సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): కౌమార బాలికలకు ప్రభుత్వం అమలుచేస్తున్న కిశోర వికాసం పేరిట కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాని సీడీపీవో విజయ కుమారి సూచించారు. శుక్రవారం కిషోర వికాశం వేసవి శిబిరం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణ, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్దేశించి 12 అంశాలపై కౌమార దశ పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలోసూపర్‌వైజర్లు, కార్యకర్తలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: కిశోర బాలికలంతా బాగా చదువుకోవాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని జీకేవీధి మండల రింతాడ గ్రామ పంచాయతీలో కిశోర వికాసం, వేసవి శిబిరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ జూన్ పదోవ తేదీ వరకు కిశోర వికాసంపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 11 నుంచి 18ఏళ్ల వయస్సు కలిగిన బాలికలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.అపరిచిత పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే సీలేరు,



మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

దుప్పులవాడ పంచాయతీల్లోనూ ఈకార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మోహిని, శాంతి పాల్గొన్నారు.

చింతపల్లి: కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని గొందిపాకలు గ్రామసచివాలయంలో కిశోరి వికాసంపై కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడారు. ఏసీడీపీవో ఎం. రామలక్ష్మి, సూపర్‌వైజర్లు, కె. విజయకుమారి, ఎస్కే గౌహర్ ఉన్నీష, ఎస్. గౌరి, పి. అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రావు పాల్గొన్నారు.

రహదారి భద్రతకు అధిక పాధాన్యం: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతకు అధిక ప్రాధ్యాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా పాడేరు, అరకులోయ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. పార్కింగ్‌కు సరైన ప్రదేశాలు లేక రోడ్లపైనే వాహనాలను నిలుపు చేస్తున్నారని, ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. హెల్మెట్ వాడకం పెరగాలని, రోడ్లపై చెత్తాచెదారాలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నియంత్రించాలన్నారు. రహదారి భద్రతలో భాగంగా ప్రతి నెలా మొదటి శనివారం అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తొలుతగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ద్విచక్రవాహనం నడిపేసమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రహదారి భద్రత, హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఘాట్ మార్గాల్లో ప్రమాదాల నియంత్రణకు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రంపచోడవరం ఆస్పత్రిలో స్కానింగ్ యంత్రం కొనుగోలుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దార్, జేసీ డాక్టర్ ఎంజే అభిషేక్‌టగౌడ, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ బాల సుందరంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రలోభాలకు గిరిజనులు గురికావద్దు

- జీవో 3కి ప్రత్యామ్నాయం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం
- టీడీపీ డివిజన్ నేత పాండురంగస్వామి



మాట్లాడుతున్న పాండురంగస్వామి

పాడేరురూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): జీవో 3కు ప్రత్యామ్నాయం, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని, ఈ విషయంలో వైసీపీ నాయకుల మాటలను నమ్మొద్దని ఆదివాసీ ప్రాంత ప్రజలకు టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి అన్నారు. శుక్రవారం ఆయన మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఏర్పడిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ఐటీడీఏలను ఏర్పాటు చేసిన ఘనత తమపార్టీదేనన్నారు. దివంగత సీఎం నందమూరి తారక రామారావు 1986లో జీవో 275ను తీసుకువచ్చి గిరిజన ప్రాంతంలో గిరిజనులకే ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. 2000లో నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జీవో 3ను తీసుకువచ్చి గిరిజన ప్రాంతంలో గిరిజనులకే ఉద్యోగాలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జీవో 3పై రివ్యూ పిటిషన్ కూడా వేయలేదని విమర్శించారు. అసెంబ్లీలో ఈ అంశం మాట్లాడలేదన్నారు. ఇప్పుడు వారు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీకి రాజానామా చేసి ఉద్యమంలోకి రావాలన్నారు. ఈ సమావేశంలో బాకూరు పంచాయతీ సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, అండిభ సర్పంచ్ తామర్ల సత్యానారాయణ, శోభకోట సర్పంచ్ పలాసి శశిభూషణం నాయుడు, క్లష్టర్ ఇన్‌చార్జ్ రూడి త్రినాథ్, గడుతుల మురళి, కిముడు మహేశ్వరి, మహేష్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



కొర్రా ప్రవీణ్ మృతదేహం

హుకుంపేట మే 2 ఆంధ్రజ్యోతి; మతిస్థిమితం లేక మండలంలోని కొంతెలి గ్రామానికి కొర్రా ప్రవీణ్ (28) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివి.. ప్రవీణ్ గత నెల 28న సంతకు వెళ్లి ఇంతవరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితంలేకపోయింది. దీంతో ప్రవీణ్ సోదరుడు గాలింపు చేపట్టారు. శుక్రవారం ఉదయం తమ గ్రామ సమీపంలోని ఓ చెట్టు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ సురేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రవీణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులను విచారణ నిర్వహించారు. ప్రవీణ్ సంతలో వెళ్లి చిన్న వ్యాపారం చేస్తుంటారని, వ్యాపారంలో ఆర్థికంగా నష్టంలో మతిస్థిమితంలేకుండా తిరుగుతున్నట్టు తెలిపారు. మృతుడు ప్రవీణ్‌కు భార్య నూకలమ్మ, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఎలుగుబంటి దాడిలో గిరిజనుడికి తీవ్ర గాయాలు



గాయపడిన జానకీరావును ఎస్. కోట ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అనంతగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట పంచాయతీ బురదగెడ్డ గ్రామానికి చెందిన గిరిజనులు తమల జానకీరావు (55) శుక్రవారం మధ్యాహ్నం ఎలుగుబంటిదాడిలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. జానకీరావు, గ్రామానికి మరో ముగ్గురితో కలిసి గ్రామసమీపంలోని పందికొండకు వెళ్లారు. ముందు వెళుతున్న జానకీరావుపై ఎ లుగుబంటి ఒక్కసారిగా దాడిచేసింది. వెనుకనున్న మరో ముగ్గురు ఆతనిని కపాడారు.. అయితే అప్పటికే జానకీరావు తొడపై ఎలుగుబండి గాయపరిచింది. వెంట వెళ్లిన గిరిజనులు అతనిని మోసుకుంటూ భీమవరం పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యసేవలనంతరం అంబులెన్స్‌లోని ఎస్. కోట ఆస్పత్రికి తరలించారు.

మండుతున్న ఎండలు... పాడేరులో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండల మండుతున్నాయి. దీంతో ఏజెన్సీ వాసులు సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తెల్లవారుజామున కాస్తా చల్లదనంగా ఉంటున్నప్పటికీ, మిలిగిన సమయంలో వేడి ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీలో శుక్రవారంపాడేరులో 37.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా కొయ్యూరులో 33.9, డుంబ్రిగుడ 33.4, ముంచంగిపుట్టులో 32.9, హుకుంపేట, అరకులోయలో 31.9, పెదబయలులో 31.3, చింతపల్లిలో 30.5, జి.మాడుగులలో 29.9, జీకేవీధిలో 29.4, అనంతగిరిలో 27,6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించండి'

పాడేరురూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన ఏజెన్సీ ప్రాంతంలో లేట రైట్ తవ్వకాలను వ్యతిరేకించాలని గిరిజన సంఘం జాతీమ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. జీకే.వీధి మండలం పెదవలస పంచాయతీ డోకులూరు గ్రామంలో లేటరైట్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం గ్రామ సభ నిర్వహిస్తుందన్నారు. ఈ సభలో ఆదివాసీ ప్రజలు తమ ప్రాంతాన్ని రక్షించుకోవాలన్నారు. లేటరైట్ తవ్వకాలు జరిగితే చుట్టు ప్రక్కల గ్రామాలు నాశనం అవుతాయన్నారు. పెసా కమిటీ, పంచాయతీ సర్పంచ్, గ్రామ ప్రజలు ఏజెన్సీ ప్రాంతాలను పరిరక్షించాని అన్నారు. గత ప్రభుత్వంలో మైనింగ్ మాఫియా నేటి ప్రభుత్వాన్ని కూడా ప్రలోభాలకు గురిచేసి అనుమతి పొందడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. మన ప్రాంత రక్షణకు బాధ్యతగా ప్రజలు వ్యవహరించాలని ఆయన సూచించారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జీవో-3 రద్దు: టీడీపీ

చింతపల్లి, మే 2 (ఆం ధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంత ఆదివాసీ యువతకు శతశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో -3 వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్లనే రద్దయిందని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రబొమ్మలు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గిన్నెల వెంకటరావు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం పూర్ణచం ద్రరావు విలేకరులతో మాట్లాడుతూ జీవో-3 తీసుకొచ్చింది టీడీపీ ప్రభుత్వమన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ జీవో రద్దు చేసిందని, వైసీపీ ప్రభుత్వం సకాలంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. జీవో నంబరు తరహాలో ప్రత్యామ్నయ జీవోను తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాడు అధికారంలో ఉన్న సమయంలో పట్టించుకోని వైసీపీ నాయకులు నేడు ఆందోళనచేస్తూ రాజకీయం చేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషణం, దూరి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు పాల్గొన్నారు.

అమరావతికి తరలి వెళ్లిన కూటమి నేతలు

కొయ్యూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగిన ప్రధాని మోదీ రాజధాని పునఃప్రారంభ పనులకు సంబంధించిన సభకు కొయ్యూరు నుంచి కూటమి కార్యకర్తలు, నేతలు భారీ గా తరలివెళ్ళారు. టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు, పాడేరు ఏఎంసీ చైర్‌పర్సన్, బీజేపీ నేత మంగతల్లి తదితర ముఖ్య నేతలు ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బస్సులలో శుక్రవారం తెల్లవారు జామున అమరావతి బయలు దేరి వెళ్లారు.

కేజీబీవీల్లో మంచి మార్కులు పొందిన
విద్యార్థినులకు కలెక్టర్ సత్కారం



మంచి మార్కులు సాధించిన విద్యార్థినికి జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

గొలుగొండ, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కేజీబీవీలోని ఇంటర్‌లో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సులో చక్కని ఫలితాలు సాధించిన విద్యార్థినులను జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ శుక్రవారం అభినందించారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని కేజీబీవీల్లో ఈ ఏడాది ఇంటర్‌లో 950 మార్కులు 26 మంది విద్యార్థిను సాధించారు. వీరందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. గొలుగొండ కేజీబీవీలో ఐదుగురు విద్యార్థినులు మోనిక 968, పెటమ్మ 963, రమా మాతాశ్రీ 958, అపర్ణ 953, వి.పూజిత 955 మార్కులు సాధించడంతో వీరు కలెక్టర్ నుంచి ప్రశంసలు అందుకున్నారని ప్రిన్సిపాల్ సుధ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

▸▸ వైద్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి ఆదేశం



పీహెచ్‌సీలో ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

కృష్ణాదేవిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని నర్సీపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి ఆదేశించారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తొలుత ఓపీ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. మందులు, రక్తపరీక్షలు చేసే ల్యాబ్, రోగులకు అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రధానంగా ఆసుపత్రితో పాటు ఆవరణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో చేపట్టిన ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉండడాన్ని గుర్తించి, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.గాయత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో ఆకతాయిల దుశ్చర్య

నర్సీపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆకతాయిలు దుశ్చర్యకు పాల్పడ్డారు. సచివాయానికి చెందిన విద్యుత్ వైరును కత్తించారు. దీంతో శుక్రవారం సచివాయం సేవలకు అంత రాయం ఏర్పడింది. ఉదయం 11.30 గంటలకు ఈపీడీసీఎల్ సిబ్బంది వచ్చి వైర్ కలిపి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియానికి ప్రహరీ గోడ లేకపోవడం, వాచ్‌మెన్‌ను నీటి సరఫరా విభాగానికి పంపించడంతో స్టేడియానికి రక్షణ కరువైంది. యువతీ యువకులు ఉదయం నుంచి సాయత్రం వరకు కాలక్షేపం చేసి వెళుతున్నారు. స్టేడియానికి రక్షణ గోడ నిర్మించాని కోరుతున్నారు.

నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు

▸▸ స్పీకర్ అయ్యన్న ప్రోత్సాహం వల్లే సాధ్యం ▸▸ ఏఎంసీ, తాండవ ప్రాజెక్టు చైర్మన్లు రమేష్, సత్యనారాయణ



వెదురుపల్లిలో కుడికాలువ వద్ద అక్విడక్ట్ పనులకు ఏఎంసీ చైర్మన్ రమేష్ శంకుస్థాపన

నాతవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు అభివృద్ధి పనులకు తుని మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముందుగా వెదురుపల్లి దగ్గర కుడి కాలువ వద్ద రూ.30 లక్షలతో చేపట్టనున్న అక్విడక్ట్ మరమ్మతు పనులు, పూడికతీత పనులకు ఏఎంసీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్ శంకుస్థాపన చేశారు. అలాగే శరభూపాలపట్నంలో నిర్మించిన సంపద కేంద్రాన్ని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఈ గ్రామంలో చైర్మన్ రమేష్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో నర్సీపట్నం నియోజకవర్గంలో ఓవైపు అభివృద్ధి కార్యక్రమాలు, మరోవైపు తాండవ రిజర్వాయర్ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలో వీరు వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ రిజర్వాయర్ డీఈఈ అనురాధ, ఏఈ దుర్గాబాబు, సర్పంచ్ లోకవరపు సత్యనారాయణ, తాండవ నీటి సంఘాల అధ్యక్షులు పంచాడ సన్యాసియ్య, అచ్చిర్ది వెంకటరమణ, ఎస్.దేముడు, మాజీ వైస్ ఎంపీపీ పల్లి బాపన్ననాయుడు, టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు పారుపల్లి వెంకటరమణ, ఏపీవో కొండాజీ, కోరుప్రోలు వెంకటేష్, పారుపల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఎదుట నినాదాలు చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న సిబ్బంది శుక్రవారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న 102 కెప్టెన్లు, డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. యాజమాన్యం చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐలకు సంబంధించి డబ్బులు ఇస్తున్నా రూ. ఎనిమిది వేల జీతం నుంచే కట్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాగైతే చాలీచాలని జీతాలతో కాలాన్ని నెట్టుకు వస్తున్న వీరు కుటుంబాలను ఏవిధంగా పోషించాలని ప్రశ్నించారు. వీరి సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిందిగా కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, రమణ, కనకరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ కోసం
సరుగుడులో గిరిజనులు బంద్



స్పెషల్ డీఎస్సీ కోసం మద్దతు కోరుతున్న గిరిమిత్ర సంస్థ సభ్యులు

నాతవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మన్యం బంద్‌కు పిలుపునివ్వడంతో శుక్రవారం సరు గుడు గ్రామంలో గిరిమిత్ర సంస్థ అధ్యక్షుడు బండి గంగరాజు ఆధ్వర్యంలో గిరిజనులు బంద్ పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం బరు 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



పట్టుబడిన నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ తదితరులు

గొలుగొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో 50 కిలోల గంజాయితో ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ గొలుగొండ మండలం పాకలపాడు జంక్షన్ వద్ద గొలుగొండ ఎస్ఐ రామారావు, సిబ్బందితో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో గంజాయిని రవాణా సాగిస్తున్నట్టు గుర్తించారన్నారు. అల్లూరి జిల్లా నుంచి కారులో 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కొన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాకు చెందిన కర్రి అప్పన్న, కర్రి రాజు, కర్రి రాధలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్టు చెప్పారు. కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. గొలుగొండ ఎస్ రామారావు, పోలీసులను డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెం పాఠశాలలో
సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు



సరస్వతి విగ్రహానికి ఎంఈవోలు, సర్పంచ్ పూజలు

గొలుగొండ, మే 2 (ఆంధ్రజ్యోతి) : పప్పుశెట్టిపాలెం గ్రామంలో గల పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి ఆర్థిక సహాయంతో ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. దీంతో శుక్రవారం ఎంఈవోలు సత్యనారాయణ, మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి, నాయకులు మాకిరెడ్డి రామకృష్ణలతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల



మాకవరపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మండలంలోని ఉపాధి కూలీల బకాయిలు విడుదలయ్యాయని ఎంపీడీవో సీతామహాలక్ష్మి శుక్రవారం తెలిపారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వరకూ సుమారు రూ.కోటి 80 లక్షల వరకు కూలీల బకాయిలు ఉండడంతో విడుదల చేశారన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 12వేల మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కూలీల బకాయిలు వారి వారి ఖాతాలకు జమయ్యాయని ఆమె వివరించారు.

దుంగలవానిపాలెంలో
మూలకు చేరిన చేతిబోరు



మాకవరపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : దుంగలవానిపాలెంలో చేతిబోరు మూలకు చేరింది. దీంతో గ్రామస్థులు తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం ఈ బోరు పాడైంది. అయినప్పటికీ దీనిపై దృష్టిసారించేవారు కరువయ్యారని అక్కడివారు వాపోతున్నారు. వేసవి కాలం కావడంతో నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని, అధికారులు వెంటనే స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని అంతా కోరుతున్నారు.

పశు వైద్యాధికారి కోసం నిరీక్షణ



వద్దాదిలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న రైతులు

బుచ్చెయ్యపేట మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం వద్దాది గ్రామం లోని పశువుల ఆసుపత్రిలో వైద్యాధికారి సమయానికి విధులకు హాజరు కాకపోవడంతో ఇబ్బంది ఎదుర్కొన్నట్టు రైతులు వాపోయారు. వద్దాది కి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు గుమ్ముడు ప్రసాద్ తన పొట్టేలను కుక్కలు కరిచివేయడంతో దానిని ఆటో లో ఆస్పత్రికి శుక్రవారం 9.30 గంటలకు తీసుకువెళ్లానన్నారు. వైద్యాధికారి వాత్సవి 11.30గంటల వచ్చారన్నారు. అలాగే, వద్దాదికు చెందిన బొబ్బాది ఈశ్వరరావు, చిన అప్పన్న పాలెంనకు చెందిన గొంతెన లక్ష్మీనారాయణ మూగజీవాలతో వచ్చి ఇబ్బంది ఎదుర్కొన్నారు. డాక్టర్ సమయానికి విధులకు హజరుకాక పోతే మూగ జీవులకు వైద్యం అందలేదని వారు వాపోయారు.

మెలకువలతోనే వేరుశనగలో దిగుబడి



వేరు శనగ పంటను పరిశీలిస్తున్న కొండెంపూడి శాస్త్ర వేత్తలు

దేవరాపల్లి,మే2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురానికి చెందిన ఆదిరెడ్డి అచ్చింనాయుడు నాగయ్యపేట సమీపంలో వేసిన వేరుశనగ పంటను శుక్రవారం కొండెంపూడి శాస్త్రవేత్తలు డాక్టర్ రాజకుమార్, సౌజన్య, సత్తిబాబుతో పాటు ఏవో ఎల్.వై.కాంతమ్మ పరిశీలించారు. రైతుతో మాట్లాడి దిగుబడులపై ఆరాతీశారు. రైతు అచ్చింనాయుడు మాట్లాడుతూ వశిష్ఠ (1694) వేరు శనగ రకం ఒక ఎకరానికి 60 కిలోల విత్తనం నాటగా, 1200 కిలోల కాయలు దిగు బడి వచ్చిందన్నారు. కిలో రూ. 55 నుంచి 60 వరకు విక్రయించినట్టు చెప్పారు. పంటకు మొత్తం రూ.23,600 ఖర్చు కాగా మొత్తం రూ.82 వేల వరకు ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, విస్తరణ అధికారి కిరణ్ కుమార్, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు ధ్వంసం



కాలిపోయిన టీవీ, గృహోపకరణాలు

చోడవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎడ్లవీధిలో పిడుగుపాటుకు పలు పూరిళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఎడ్లవీధిలో కొండూరి సతీశ్ ఇంట్లోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో దగ్ధమైంది. పిడుగుపాటుకు వెదురుపర్తి కామాక్షి ఇంట్లో ఫ్రిజ్, గ్రైండర్, టీవీలతో పాటు, వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. కొం డూరు సతీశ్ ఇంట్లో టీవీతో పాటు, రెండు ఫ్యాన్లు కాలిపోయాయి. సబ్బవరపు భారతి, గువ్వల లక్ష్మి ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. మరో కొందరి ఇళ్లల్లో విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయి. దీంతో స్థానికులు లబోదిబోమంటున్నారు.

చలిసింగం రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలి

▸▸ జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీవీఎస్ఎన్ రాజు, నాయకులు

రావికమతం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు చలిసింగం పక్కా రోడు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం ఈ రోడ్డు పనులను వీరు పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శికాయి పాడు నుంచి కొండ శిఖరం చలిసింగం గిరిజన గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నారు. మార్గం మధ్యలో పెద్ద పెద్ద బండ రాళ్లు అడ్డం వస్తున్నందు నిర్మాణ పనులు త్వరిగతిన సాగడంలేదని కాంట్రాక్టరు జనసేన బృందానికి తెలిపారు. అయినా, మూడునాలుగు నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా నాణ్యత ఏమాత్రం లోపించకుండా రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కాంట్రాకక్టర్‌ను పీవీఎస్ఎన్ కోరారు. ఈ రోడ్డు పూర్తయితే చలిసింగం గిరిజన ప్రజలకు డోలీ మోత తప్పనుందని అన్నారు. కార్యక్రమంలో రావికమతం,రోలుగుంట మండలాల జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఝైచర్లనాయుడు, బలిజ మహారాజు, చింతల కిశోర్, దొరబాబు, కె.అప్పారావు,కోన రమణ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక వాయిదా



సమావేశమైన టీడీపీ నాయకులు

మాడుగుల, మే 2(ఆంధ్రజ్యోతి): మాడుగుల టీడీపీ గ్రామశాఖ ఎన్నిక వాయిదాపడింది. గ్రామశాఖ అధ్యక్ష, కా ర్యదర్శులను ఎన్ను కోవాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు నియోజకవర్గ పరిశీలకుడు ఏసుదాసు పర్యవేక్షణలో ఆరుగురు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా పంచాయతీల్లో కమిటీల ఏక గ్రీవం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన ఈ ఎన్నికన మావేశం జరిగింది. ఈ సందర్భంగా గతంలో ఉన్న కొందరు పట్టణ అధ్యక్షుడికే ఈ పదవి ఇవ్వాలని కోరారు. ఇందుకు కొందరు నిరాకరించడంతో ఎన్నిక వాయిదాపడింది. ఈ ఎన్నిక త్వరలో నిర్వహిస్తామని మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, కమిటీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట మే 2 (ఆంధ్రజ్యోతి)మండలంలోని విజయరామరాజు పేట హైస్కూల్‌లో పదో తరగతి మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన కాండ్రేగుల శంకర్, ఊర్మిల. భువనేశ్వరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొడ్డి కిశోర్, స్కూల్ కమిటీ చైర్మన్ వేగి గోవింద, హెచ్ఎం కె.ఉదయ్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు, వీరితోపాటు 500లకుపైగా మార్కులు వచ్చిన వారిని సన్మానించారు. అనకాపల్లిలో టెన్త్‌లో 560 మార్కులు సాధించిన వద్దాది కస్తూర్బా స్కూల్‌కు చెందిన శ్రీలాస్య కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు కడియం శ్రీనివాస్, జ్యోతి, ఉపాధ్యాయులున్నారు.



శ్రీలాస్యను సన్మానిస్తున్న కలెక్టర్

లక్కవరం ఇసుక ర్యాంపులో మైనింగ్ అధికారుల దాడులు



ర్యాంపును పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

చోడవరం, మే2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరం పరిధిలో శారదానదిలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్న ఇసుక ర్యాంపును జిల్లా మైనింగ్ శాఖ అధికారులతో పాటు, రెవెన్యూ సిబ్బంది గురు, శుక్రవారాల్లో తనిఖీలు చేశారు. శారదానదిలో విచ్చలవిడిగా సాగుతున్న తవ్వకాలపై మైనింగ్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు, వారి నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. లక్కవరం, కె. కోటపాడు మండలం సరిహద్దు మల్లపాడు పరిసరాల్లో శారదానదిలో సాగుతున్న విధ్వంసంపై బుధవారం ఇసుకాసురుల బరితెగింపు శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా కథనం ప్రచురించిన సంగతి విదితమే. ఇసుక అక్రమ తవ్వకాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం నేపథ్యంలో గురువారం మైనింగ్, రెవెన్యూ అధికారులు వేరువేరుగా ర్యాంపులో సాగిన ఇసుక తవ్వకాలను పరిశీలించారు. కాగా లక్కవరంలో అక్రమ ఇసుకర్యాంపులో ట్రెంచ్‌లు తవ్వడానికి రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఇసుక తవ్వకాలపై కలెక్టర్ సీరియస్

కాగా మండలంలో అక్మమ ఇసుక తవ్వకాలపై కలెక్టర్ సీరియస్ అయినట్టు సమాచారం. మండలంలో ఇసుక దోపిడీ నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ రెవెన్యూ అధికారులకుఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తుంది. దీంతో పంచాయతీల్లో ఇసుక తవ్వకాలకు రెవెన్యూ సిబ్బంది బ్రేకులు వేశారు.

అధికారులపై విచారణ చేపట్టాలి: సీపీఐ

చోడవరం: మండలంలో ఇసుక గ్రావెల్ అక్రమ తవ్వకాలకు ప్రోత్సహిస్తున్న రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి, చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలో నరసాపురం, లక్కవరం, ఖండేపల్లి, భోగాపురం తదితర గ్రామాల్లో ఇసుక వ్యాపారం , గ్రావెల్ తవ్వకాలు పెద్దఎత్తున సాగుతున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. నరసాపురంలో ఓ బినామీ అధికార పార్టీ నేతల సహకారంతో ఇష్టారీతిగా వ్యాపారం చేస్తున్నారన్నారు.

వేతనానికి తగిన రీతిలో ఉపాధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

చీడికాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలతో వేతనానికి తగిన రీతిలో పనులు చేయించాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని 23పంచాయతీల్లో కోనాం, అప్పలరాజుపురం, ఖండివరం, ఎల్‌బీ పట్నం, చీడిపల్లి, చీడికాడ పంచాయతీల్లో సరాసరి వేతనం రూ.270లు నుంచి రూ.300లు వస్తుండగా, మిగతా 18 పంచాయతీల్లో రూ.206 నుంచి రూ.256లు వరకూ వస్తున్నాయన్నారు. వీటిని సరాసరి రూ.307లు వచ్చేలా ఉదయం 6 నుంచి 11గంటలవరకూ కూలీలతో పనులు చేయించాలని ఆదేశించారు. అలాగే పంచాయతీవారీగా తీసుకున్న లక్ష్యాలను పూర్తిచేయించాలని ఆదేశించారు. జూన్ 30 వరకూ లేబర్ బడ్జెట్ ఎక్కువ పెంచాలని ఆదేశించారు. అనంతరం మండలంలో చెట్టుపల్లి, వరహాపురం గ్రామాల్లో నిర్మించిన పశువుల నీటి తొట్టెలను ఆమె పరిశీలించారు. సమావేశంలో ఆ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ బండారు శ్రీనివాసరావు, ఎంపీడీవో హేమసుందరరావు, ఏపీవో అల్లు గంగునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు ఛేదించిన పోలీసులు

బుచ్చెయ్యపేట మే2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి పిల్లలతో వివాహిత అదృశ్యం కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. గత నెల 24న అప్పంపాలెం గ్రామానికి చెందిన చల్లపు వరలక్ష్మి ఇద్దరు పిల్లలతో అనకాపల్లి హాస్పిటల్ కి వెళ్లి వస్తానని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త శివ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థ ద్వారా కనుకొని వరలక్ష్మి ఇద్దరు పిల్లలతో ఆచూకీ పోలీసులు గుర్తించారు. వీరిని స్టేషన్‌లో వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

రావికమతం, మే 2, (ఆంధ్రజ్యోతి):ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో కె.వెంకన్నబాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న జెడ్. బెన్నవరం, ఆరున పి.పొన్నవోలు, 7న, దొండపూడి, 8న, కొత్తకోట-1, 12న గొంప, 13న గుడివాడ, 14న కన్నంపేట, 15న జెడ్.కొత్తపట్నం సచివాలయల పరిధిలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నామన్నారు. ప్రతి కేంద్రంలోనూ 50 మంది పిల్లల చొప్పున ఆధార్ నమోదు చేయించాలని ఆయన ఆదేశించారు.

కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన

రోలుగుంట, మే 2 (ఆంధ్రజ్యోతి) : బాలికల సమగ్ర ఎదుగుదలకు కిశోరి వికాసం కార్యక్రమం ఉపయోగపడుతుందని కొవ్వూరు సచివాలయం మహిళా పోలీసు వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం కొవ్వూరు అంగన్‌వాడీ కేంద్రం-2లో కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని కోరారు. 18 ఏళ్ల లోపు వివాహం చేస్తే పోలీసు స్టేషన్‌లో గాని, ఐసీడీఎస్ అధికారులకు గాని సమాచారం అందించాలని సూచించారు. కౌమర బాలికల సమస్యలు, బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు





మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభ వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



జి.భీమవరంలో సీనియర్ సిటిజన్ హోం

... 5వ పేజీ తరువాయి

సుల భతరం అవుతుందన్నారు. కార్డులు పొందాల్సిన వారు గ్రామ/ వార్డు సచివాలయాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం, లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.రవిప్రకాశ్‌రెడ్డి, ఏడీ బి.ఆశయ్య, డీఆర్వో వై.సత్యనారాయణరావు, 'పావని సొసైటీ' నిర్వాహకురాలు డి.రజని, కార్యదర్శి ఎం. సత్యవాణి, ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జి.భీమవరం వృద్ధాశ్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సీనియర్ సిటిజన్‌లు

చెరకు రైతుకు దక్కని ఊరట

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో ఆ ప్రభావం రైతులపై పడుతున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువ లభిస్తున్నది. ఉదాహరణకు 2024-25 క్రషింగ్ సీజన్‌లో కేంద్రం చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3,400గా ప్రకటించింది. కానీ అంతకు ముందు క్రషింగ్ సీజన్‌లో వచ్చిన పంచదార రికవరీ శాతం ఆధారంగా గోవాడ షుగర్స్ యాజమాన్యం టన్నుకు రూ.3,230 మాత్రమే చెల్లిస్తున్నది. ఇటీవల ముగిసిన క్రషింగ్ సీజన్‌లో రైతులు లక్షల టన్నుల చిలుకు చెరకును ఫ్యాక్టరీకి సరఫరా చేశారు. టన్నుకు రూ.170 చొప్పున సుమారు రెండు కోట్ల రూపాయాల మేర రైతులు నష్టపోయాయి.

సాగు చేద్దామా.. వదిలేద్దామా..

కొన్నేళ్లుగా చెరకు సాగు వ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది. కొంతమంది రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదు. దీంతో ఒక్కరొక్కరుగా చెరకు సాగు మానేస్తున్నారు. జిల్లాలో గతంలో నాలుగు షుగర్ ఫ్యాక్టరీలు వుండగా, వైసీపీ హయాంలో వీటిలో మూడు ఫ్యాక్టరీలు మూతపడిన విషయం తెలిసిందే. ఉన్న ఒకే ఒక్క గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి త్రిశంకు స్వర్గంలో వుంది. గత సీజన్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తి రోజుల తరబడి క్రషింగ్ నిలిచిపోయింది. దీనివల్ల పంచదార రికవరీ శాతం మరింత తగ్గిపోతున్నది. ఒకప్పుడు ఐదు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేసిన గోవాడ ఫ్యాక్టరీ ఈ ఏడాది లక్షా 9 వేల టన్నులకే పరిమితమైంది. చెరకు సాగు గిట్టుబాటు కాక రైతులు వేరే పంటల వైపు మళ్లడమే ఇందుకు కారణం. ఈ ఏడాది ఫ్యాక్టరీ పరిస్థితి చూసి, పలువురు రైతులు చెరకు సాగు కొనసాగించాలా? లేకపోతే మానుకోవాలా? అన్న సందిగ్ధంలో వున్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సమ్మె

... 5వ పేజీ తరువాయి

కాలపరిమితి ముగిసి ఏడు నెలలు కావస్తున్నా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, ఏటా బోనస్ కింద రూ.10 వేలు ఇవ్వాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫుట్‌బోర్డు వద్ద నిలబడి ప్రయాణిస్తున్న వారు పొరపాటున జారిపడి మరణిస్తే డ్రైవర్లను బాధ్యులను చేసి ఉద్యోగంలో నుంచి తొలగించడం సరికాదని అన్నారు. చర్చల పేరుతో ఇటు బస్సుల ఆపరేటర్లు, అటు పీటీడీ యాజమాన్యం తమ సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తున్నారని, విధి లేని పరిస్థితిలో సమ్మెకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సుల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, నాయకులు జి.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ

కాగా డ్రైవర్లకు వేతనం పెంపు, బోనస్ ఇవ్వడానికి బస్సుల యజమానులు అంగీకరించడంతో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు చేపట్టిన సమ్మెను శుక్రవారం రాత్రి విరమించినట్టు ఆర్టీసీ ఏడీఎం రవిచంద్ర తెలిపారు. శనివారం నుంచి అద్దె బస్సులు యథావిధిగా నడుస్తాయని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

అనకాపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు మే 5వ తేదీ వరకు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులు అడ్వాన్స్‌డు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఏప్రిల్ 22వ తేదీ వరకు ఫీజు చెల్లంపునకు గడువు ఇచ్చిందన్నారు. చాలామంది విద్యార్థులు ఫీజు చెల్లించలేకపోయారని, వారంతా ప్రభుత్వాన్ని గడువు కావాలని కోరడంతో మే 5వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో ఇంటర్ జనరల్ గ్రూపుల్లో 752 మంది, ఒకేషనల్ గ్రూపులకు చెందిన 180 మంది వరకు ఫీజులు చెల్లించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఆదివారం సెలవు దినంతోపాటు సోమవారం కూడా ఆయా కళాశాలల్లో సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించే అవకాశం కల్పించామని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

సింహగిరిపై 'ప్రసాద్' పనుల్లో తీవ్ర జాప్యం

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నప్పుడు రెండు శాఖల ఇంజనీరింగ్ అధికారులు వెళ్లి పరిశీలించారు. సిమెంట్ స్తంభాలు వేయకుండా గోడ కడుతున్నా అభ్యంతరం వ్యక్తంచేయలేదు. అలా నిర్మిస్తే గోడ పడిపోతుందని తెలిసినా మిన్నకున్నారు. దీనిపై త్రిసభ్య కమిటీ విచారణ చేసినప్పుడు ఈ గోడ నిర్మాణ బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నిస్తే ఒక్కరు కూడా ముందుకురాలేదు. కమిటీ అదే విషయం నివేదికలో ప్రస్తావిస్తామని ప్రకటించింది.

జరుగుతున్న పనులు రాష్ట్ర స్థాయి అధికారులకు తెలుసా?

సింహాచలంలో జరుగుతున్న పనులు విజయవాడలో ఉన్న ఏపీటీడీసీ ఉన్నతాధికారులు, దేవదాయ శాఖ అధికారులకు తెలుసా? లేదా? అనే అంశాలపై కూడా విచారణ చేస్తామని త్రిసభ్య కమిటీ పేర్కొనడం గమనార్హం. అంటే విశాఖ, విజయవాడ అధికారుల మధ్య కూడా సమన్వయలోపం ఉన్నట్టుగా అర్థమవుతోంది.

ఆదరాబాదరాగా శుక్రవారం టెండర్

ప్రసాద్ పథకం కింద సింహగిరిపై చేపట్టాల్సిన పనులు ఇంకా అనేకం ఉన్నాయి. ప్రమాదం జరగడం, ఈ పథకం పనులపై చర్చ జరగడంతో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన పనులు చేపట్టడానికి శుక్రవారం టెండర్ ప్రకటన విడుదల చేశారు.

జూన్ 9, 10 తేదీల్లో విశాఖలో ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సహా పలువురు ప్రముఖులు రాక

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో జూన్ 9, 10 తేదీల్లో ఈ-గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు జరగనున్నది. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం సదస్సును నోవాటెల్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు, పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారు. 'వికసిత్ భారత్-సివిల్ సర్వీసెస్ ఆన్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్' పేరిట ఈ సదస్సును కేంద్ర ప్రభుత్వంలోని డిపార్టుమెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్‌స్, కేంద్ర కమ్యూనికేషన్లు, ఐటీ మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. తక్కువ సిబ్బందితో అధిక ఫలితాలు సాధించేలా పాలనకు సంబంధించి మేధావులు, పారిశ్రామికవేత్తలు, విద్యావంతుల నుంచి సలహాలు తీసుకుని పాలసీ రూపొందించడమే సదస్సు ముఖ్య ఉద్దేశం. కాగా సదస్సుకు కేంద్రం, పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో నగరంలోని హోటళ్లలో 600 గదులను ముందుగానే రిజర్వు చేశారు. వాహనాలు ప్రధానంగా ఏసీ బస్సులు, కార్లు కోసం ట్రావెల్స్ సంస్థలతో మాట్లాడుతున్నారు. సదస్సు ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించింది. కలెక్టర్ అధ్యక్షతన పలు కమిటీలు ఏర్పాటుచేశారు. విశాఖ వేదికగా 2017లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సు జరిగింది.